క్లుప్తంగా

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక


కృష్ణారెడ్డి

మునిపల్లి(అందోల్): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మునిపల్లి మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ భీంసింగ్ గురువారం తెలిపారు. ప్రధానోపాధ్యాయుల కేటగిరిలో తాటిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఎస్‌జీటీ కేటగిరిలో బొడ్చట్‌పల్లి ప్రైమరీ పాఠశాల నుంచి వసంత్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ కేటగిరిలో భాస్కర్‌రెడ్డి ఎంపికైనట్లు చెప్పారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

ఉత్సాహంగా సాగిన శోభాయాత్ర


ఊరేగింపుగా తరలిన గణేశుడు

జహీరాబాద్ టౌన్: నవరాత్రులు విశేష పూజలు అందుకున్న వినాయకులు గంగమ్మ ఒడికి చేరారు. గురువారం పట్టణం, ఆయా గ్రామాల గణనాథుల నిమజ్జనం ప్రక్రియ భక్తి శ్రద్ధలతో సాగింది. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభయాత్ర ఉత్సాహంగా సాగింది. డప్పు వాయిద్యాలు, భజనలు, కీర్తనలతో పురవీధులు మార్మోగాయి. బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్లతో హోరెత్తాయి. సాయంత్రం ప్రారంభమైన శోభయాత్ర తెల్లవారు జాము వరకు కొనసాగింది. ఊలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 800 మంది పోలీసులుతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జహీరాబాద్ సమీపంలో గల నారింజ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

జహీరాబాద్: పట్టణంలోని వెంకటరమణ కాలనీకి చెందిన మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. పది సంవత్సరాల నుంచి కాలనీలో రోడ్లు, మురికి కాల్వలు నిర్మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మురికి నీరంతా ఇళ్లల్లోకి చేరుతోందని వాపోయారు. =ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావుకు వినతిపత్రం అందజేశారు. అవసరం ఉన్న చోట తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం


క్రీడలను ప్రారంభిస్తున్న జాఫర్ తదితరులు

జహీరాబాద్ టౌన్: చదువుతో పాటు ఆటలపోటీలు కూడా అవసరమని మొగుడంపల్లి మండల విద్యాధికారి జాఫర్ అన్నారు. మండలంలోని ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు అట్టహాసంగా ప్రారంభమెయ్యాయి. ఈ సందర్భంగా ఆయన క్రీడాజ్యోతి వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం జాఫర్ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ధృఢత్వం ఆరోగ్యం కలుతుందన్నారు. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యం బయటపడుతుందని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.రమేశ్ కుమార్, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

న్యాల్‌కల్(జహీరాబాద్): పశువులకు ముందస్తు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు న్యాల్‌కల్ పశు వైద్యాధికారి గణేశ్ అన్నారు. మండల పరిధి రాంతీర్థ్, డప్పూర్, న్యాల్‌కల్ తదితర గ్రామాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించిన వైద్యులు, సిబ్బంది పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యుడు గణేశ్ మాట్లాడుతూ.. పుర్రు రోగం రాకుండా టీకాలు వేస్తున్నామని ఇప్పటి వరకు మండలంలో 540 గొర్రెలు, 445 మేకలకు టీకాలు వేశామన్నారు. జీవాలతో పాటు ఇతర పశువులకు జబ్బ, గొంతు వ్యాధి రాకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నామని తెలిపారు.

ప్రత్యేక అధికారులతో పాట్లు

గాడి తప్పిన పాలన

- అన్నీ మున్సిపాల్టీల్లోనూ అస్తవ్యస్తం
- ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారులుగా ఉండటంతో ఇక్కట్లు


పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. దాంతో ఓ మాజీ కౌన్సిలర్ సమస్యను గుర్తించి డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూ పాలని అధికారులను వేడుకున్నారు. డ్రైనేజీ రిపేర్ చేసే యంత్రం పనిచేయట్లేదని తామేమీ చేయలేమని సిబ్బంది చెప్పారు. స్పెషల్ ఆఫీసర్ అందుబాటులో లేని కారణంగా ఆ యంత్రాన్ని మరమ్మతు చేయలేకపోయామని ఉన్నతాధికారులు స్ప ష్టం చేశారు. కానీ ప్రజలు మాత్రం పొంగిపొర్లే డ్రైనేజీ మురుగునీటిపై నడవాల్సి వస్తుంది. నియోజకవర్గంలోని అన్నీ మున్సిపాల్టీలోనూ ఇదే తంతు. తెల్లాపూర్, బొల్లారం, గుమ్మడిదల, జిన్నారం, ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేక అధికారుల దర్శనం మాత్రం మున్సిపల్ అధికారులకు కూడా లభించడం లేదు. అమీన్‌పూర్ మున్సిపాలిటీకి తొలుత ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ పాల్గుణ్ కుమార్ ప్రత్యేక అధికారిగా పనిచేశారు. ఆయన పని చేసిన కాలంలో ఒక్కసారి అంటే ఒక్కసారి మాత్రమే మున్సిపాలిటీకి వచ్చారు. ఆ తర్వాత వాణి అనే మరో ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆమె పని తీరుపై స్థానికులు విసుగెత్తారు. ఆమె ఒక్క రో జు కూడా అమీన్‌పూర్ మున్సిపాలిటీని సందర్శించలేదు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆమెపై స్వయంగా రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేశారు.

సర్పంచుల కాలంలోనే నయం

అమీన్‌పూర్‌లో చాలా ప్రాంతాలు ఇటీవల మున్సిపాలిటీలుగా మారాయి. మొన్నటి వరకు అన్నీ గ్రామాల్లోనూ పంచాయతీ అధికారుల పాలనలో కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఏదైనా బోరు మోటార్ ట్రాక్టర్ రిపేర్లు వచ్చినా పంచాయతీ కార్యదర్శులు లేదా తాజా మాజీ సర్పంచ్‌లో ఇతర గ్రామ పెద్దలు తమ సొంత జేబు నిధులను ఖర్చు పెట్టి గ్రామస్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మున్సిపాలిటీలో కానరావడం లేదు. స్పెషల్ ఆఫీసర్ సంతకాలు ఉంటేనే గాని నిధులు మంజూరు కావడం లేదు. దాంతో చిన్న చిన్న మరమ్మతులకు సైతం నెలల వరకు వేచి చూడాల్సి వస్తుంది. అమీన్‌పూర్‌కు ఇప్పుడు జిల్లా అదనపు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉన్నారు. జిల్లా బాధ్యతలతోనే అనునిత్యం బిజీగా ఉండే ఆయన మున్సిపాల్టీకి సమయం కేటాయించలేకపోతున్నారు. అధికారులు కనీసం అందుబాటులో ఉండకపోవడంతో కింద స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తాజా మాజీ ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కార్డులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేజింతల్, ఖలీల్‌పూర్, గంగ్వార్, మిర్జాపూర్(బి) గ్రామాల్లో గురువారం లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్టీలకతీతంగా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఏసప్ప, మైమూద్ అలీ, సిరాజోద్దీన్, రేషన్ డీలర్లు ఉలిగడ్డ సిద్ధలింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం


ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని పురాణాబస్తీ కాలనీకి చెందిన అహమ్మది కథాన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. రెండు లక్షల 50 వేల ఎల్ఓసి ని గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

అధికారులను సస్పెండ్ చేయాలి


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: కార్మికులపై దుర్భాషలాడిన కంగ్టి ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ సుభాష్‌లను సస్పెండ్ చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెండు రోజుల క్రితం పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కంగ్టి మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా కులం పేరిట దూషించి దురుసుగా ప్రవర్తించారన్నారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతి పత్రం అందజేశారు. సంఘ జిల్లా, డివిజన్ నాయకులు నర్సింహులు, విద్యాసాగర్, రమేశ్, సతీశ్, అంజయ్య, ఎల్లయ్య, తుకారాం పాల్గొన్నారు.

సర్వే పనులు అడ్డుకున్న రైతులు


సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు శిఖం కబ్జాకు గురైందని రైతులు ఆందోళన చేశారు. గురువారం మార్డి పెద్దచెరువును ఇరిగేషన్ ఈఈ సుందర్, డీఈఈ జలంధర్, తహసీల్దార్ శివ శ్రీనివాస్, సర్వేయర్ ప్రభాకర్ సందర్శించారు. చెరువులో పట్టా భూమి ఉందని ఓ రైతు ఇటీవల అడ్డుకట్టలు వేశాడు. అప్పట్లో చెరువును కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టా భూమి ఉందని రైతు సర్వే చేయాలని అధికారుల వద్ద అర్జి పెట్టుకున్నాడు. దీంతో అధికారులు సర్వే చేసేందుకు పనులు మొదలు పెట్టే క్రమంలో రైతులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. అధికారులతో వాదనకు దిగారు. అధికారులు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి రైతులకు నచ్చజెప్పారు. ఈ నెల 6న సర్వే చేయాలని నిర్ణయించారు. మరో పక్క చెరువు కబ్జా చేయకుండా కాపాడాలని గ్రామస్తులు డిమాండు చేస్తున్నారు.

కోతకు గురైన గంగాపూర్ ప్రాజెక్టు కట్ట

ఆందోళనలో అన్నదాతలు

నారాయణఖేడ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖేడ్ మండలం గంగాపూర్ ప్రాజెక్టు కట్ట ఒక వైపు కోతకు గురైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ర్యాకల్- గంగాపూర్ గ్రామాల మధ్య ఉన్న గంగాపూర్ ప్రాజెక్టు ద్వారా 300 ఎకరాల వరకు ఆయకట్టు సాగవుతుంది. భారీ వర్షాలకు ఎగువనుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో అలుగు పలుమార్లు పొంగిపొర్లింది. గురువారం ప్రాజెక్టు కట్ట ఒకవైపు కోతకు గురికావడంతో ఎప్పుడు తెగిపోతుందోని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షం మళ్లీ కురిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ సురందర్ వద్ద ప్రస్తావించగా గంగాపూర్ ప్రాజెక్టు కట్ట కోతకు గురైన విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే కట్టను సందర్శించామని, తక్షణం మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.

108 వంటకాలతో నైవేద్యం


నైవేద్యాలు సమర్పించిన భక్తులు

జహీరాబాద్: పట్టణంలోని శ్రీసాయిరాం నగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి మహిళా భక్తులు 108 తీరొక్క రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు. బుధవారం రాత్రి మండపానికి కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

ఖేడ్ కార్మికశాఖ సహాయ అధికారిగా యాదయ్య

నారాయణఖేడ్: ఖేడ్ కార్మికశాఖ ఇన్‌చార్జి సహాయ అధికారిగా యాదయ్య నియమితులయ్యారు. ఇక్కడ సహాయ అధికారిగా పనిచేసిన గిరిరాజ్ ఇటీవల అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురయ్యారు. వికారాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న యాదయ్యకు ఇక్కడి అదనపు బాధ్యతలు ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలను స్వీకరించారు. జూనియర్ అసిస్టెంట్‌గా జయకృష్ణ బాధ్యతలను స్వీకరించారు.

పీహెచ్‌సీ తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి గురువారం తనిఖీ చేశారు. డాక్టర్ ప్రతిభతో మాట్లాడి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రశేఖర్, భాస్కర్, రఘు, రాంచందర్ పాల్గొన్నారు.

చెరువుకు మరమ్మతులు చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాయిలు

వట్‌పల్లి(అందోల్): మండలం పరిధి గౌతపూర్‌లోని హంస చెరువుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.సాయిలు అన్నారు. గురువారం గ్రామంలో పర్యటించి చెరువు తూము ద్వారా వచ్చే నీటి కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో పత్తి చేలపై నుంచి నీరు పారి పంట నష్టం వాటిల్లుతోందన్నారు. చెరువులోని నీరు వృథా పోకుండా రైతులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలతో రైతుల పరిస్థితి గోరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సింలు సీపీఎం అందోల్ డివిజన్ కార్యదర్శి డి విద్యాసాగర్ నాయకులు నరేందర్ గౌడ్, మహేశ్, భీమయ్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి చంద్రన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పంటలు నష్టపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.

వాటర్ ట్యాంక్‌లు శుభ్రంగా ఉంచాలి

ఎంపీడీఓ శ్రీనివాస్


వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని గుంజోటి, వడ్డి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మురికికాల్వలు, వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బొల్లారంలో హైడ్రా బృందం పర్యటన


చెరువును పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 21లో దామరచెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదుపై హైడ్రా అధికారుల బృందం గురువారం దామరచెరువును సందర్శిం చారు. ఈ మేరకు హైడ్రా సీఐ బాలరాజు, డీఈ అర్చన మాట్లాడుతూ.. దామరచెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో తేజ కన్‌స్ట్రక్షన్ మైత్రి హోమ్స్ అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో చెరువును పరిశీలించామన్నారు. కబ్జా తీరును అన్ని కోణాల్లో సర్వే చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎక్కడైనా చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా గురైనట్లు తమ దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు ఉంటాయని అధికారులు బృందం స్పష్టం చేసింది. కార్యక్రమంలో హైడ్రా ఎమ్మార్వో హర్దీప్ సింగ్, జిన్నారం ఎమ్మార్వో దేవదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమం ఆదర్శప్రాయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఒక్కరి కోసం అందరూ.. అందరికోసం ప్రతీ ఒక్కరూ అనే నినాదంతో టీఎస్‌యూటీఎఫ్ నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమం అందరికీ ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మనూరు మండలం రాణాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మేకల శివకుమార్ జూన్ 13న మృతి చెందారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కుటుంబ సంక్షేమ నిధి ద్వారా రూ.6 లక్షల చెక్కును శివకుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని మున్ముందు మరింత బలోపేతం చేయాలన్నారు. సంఘం రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి మాట్లాడుతూ.. 2023 మే 2న తమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ నిధి కార్యక్రమం ప్రారంభించి ఆకస్మికంగా మృతి చెందిన 46 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున రూ.2.76 కోట్లను అందించామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా కన్వీనర్ సాయితేజ, జిల్లా, డివిజన్ బాధ్యులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో మందుల్లేవ్

అవస్థలు పడుతున్న రోగులు



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో మందులు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.పాండురంగా రెడ్డి, బి.నాగేశ్వరరావు ఆరోపించారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇస్నాపూర్, పటాన్‌చెరు, పార్టీ ఘనపూర్, బొల్లారం, గమ్మడిదల డిస్పెన్సరీల్లో బీపీ, షుగర్‌కు సంబంధించిన టాబ్లెట్లను రోగులకు అందుబాటు ఉంచాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల చిన్న చిన్న రోగాలకు సంబంధించిన మందులు కూడా అందుబాటులో ఉంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు ఆస్పత్రికి సకాలంలో రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మణిరాజు, గంగాధర్, చంద్రకిరణ్ సింగ్, రామచంద్రామూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఉభచెరువులో శనివారం జరిగే నిమజ్జన ఏర్పాట్లను గురువారం పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో శాఖలవారీగా సూచించిన పనులు పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉభచెరువు నిండుకుండలా ఉన్నందున గజఈతగాళ్లు, పడవలు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివాజీ, సీఐ వెంకటేశ్, ఇంజనీర్ రాజేశ్, టీపీఓ భాస్కర్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ కంది కృష్ణ, డైరెక్టర్ చీరు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బిట్ కాయిన్ పేరుతో మోసం

పటాన్‌చెరు టౌన్: బిట్ కాయిన్ పేరుతో మోసపోయిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి జూన్ 10న ఇన్‌స్టాగామ్ చూస్తుండగా బిట్ కాయిన్ రీల్ చూసి ఫోన్ చేసి వివరాలు అడగగా, నగదు ఇన్వెస్ట్ చేస్తే లాభం వచ్చిన దాంట్లో రిటర్న్స్ ఇస్తామని చెప్పారు. దీంతో బాధితుడు పలు దఫాలుగా రూ.99 వేలు పెట్టాడు. పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వమని అడగగా, వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, గురువారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ రేషన్ కార్డులు పంపిణీ

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధి మల్కాపూర్‌లో గురువారం తహశీల్దార్ అశోక్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు వస్తుందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నూతనంగా రేషన్ కార్డు వచ్చిన వారు వచ్చే నెల నుంచి రేషన్ పొందవచ్చన్నారు.

◆ స్థానిక ఎన్నికల్లో సీపీఐ పోటీ

నారాయణఖేడ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీలో ఉంటుందని ఆపార్టీ ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్ అన్నారు. గురువారం పార్టీ డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ నిరంతరం కార్మికులు, కష్టజీవులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, యువత, అణగారిన వర్గాల పక్షాన పోరాడుతుందన్నారు. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సంసిద్ధులు కావాలన్నారు. నాయకులు చిరంజీవి, పుప్పాల అశోక్, సీహెచ్ అశోక్ పాల్గొన్నారు.

◆ కిటకిటలాడిన గణేశ్‌గడ్డ దేవస్థానం

పటాన్‌చెరు టౌన్: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్ గడ్డ దేవస్థానంలో గురువారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ... ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, హోమంతో పాటు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించమన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని నాణేలతో అలంకరించి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించారు.

◆ పెండింగ్ వేతనాలు చెల్లించండి

పటాన్‌చెరు టౌన్: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు గత ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈఎస్ఐ రామచంద్రాపురంలో ఔట్‌సోర్సింగ్‌లో 125 మంది, కాంట్రాక్టు వర్కర్లుగా 56 మంది పనిచేస్తున్నారని తెలిపారు. 15 సంవత్సరాలుగా పని చేస్తున్నా కేవలం ప్రస్తుతం పది వేల రూపాయల ఇస్తున్నారని వాపోయారు. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేస్తూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని మండిడ్డారు. కోటి 60 లక్షల రూపాయలు జీతాల చెల్లింపు కోసం మంజూరైన సంబంధిత కాంట్రాక్టర్లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.

◆ సామూహిక కుంకుమార్చన

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఎడ్లబజార్ బసవేశ్వర మందిరం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో గురువారం శ్రావణమాస మండల ముగింపు సందర్భంగా మహిళలు ఉమామహేశ్వర వ్రతం, సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరశైవ సమాజం ఎడ్లబజార్ అధ్యక్షుడు గందిగరాజు, కార్యదర్శి రాచన్న దంపతులు ఉమామహేశ్వర వ్రతం అచరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

◆ ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మున్సిపాలిటీల్లో ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రశాంతంగా ముగిశాయి. తహసీల్దార్ దేవదాస్ ముఖ్యఅతిథిగా హాజరై కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం ఆ దిశగా క్రీడలను ప్రోత్సహిస్తూ నిర్వహించడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కుమారస్వామి, గుమ్మడిదల ఎంఈఓ రాంబాబు, హెచ్‌ఎంలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400